

సోమశిలలో 30.200 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారం 30.200 టీఎంసీల నీరు ఉంది. ప్రస్తుతం 91.650 మీటర్ల మట్టం నమోదు అయింది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.59,860
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,393
3శాతం జీఎస్టీతో	రూ.5,555
సవర (8గ్రా)	రూ.44,440

గరిష్టం/కనిష్టం
36.3 /27.5

వాతావరణం

గురువారం గాలిలో తేమ 51 శాతం ఉంది. శుక్రవారం ఎండతీవ్రత, ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

పంచాయతీ పాలనపై ఐఎస్‌ఓ ప్రతినిధి ఆరా



అధికారులు, పారిశుధ్య కార్మికులతో ఐఎస్‌ఓ ప్రతినిధి శ్రీషా

పొదలకూరు: కేరళ రాష్ట్రం నుంచి ఐఎస్‌ఓ (ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) ప్రతినిధి కే.శ్రీషా గురువారం పొదలకూరు పంచాయతీ పాలనను పరిశీలించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా పంచాయతీ పాలన, వసతులను పరిశీలించారు. సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులు, సెక్రటరీ ఎస్కే అల్లాభక్షుతో మాట్లాడుతూ పంచాయతీ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. బిట్–1 సచివాలయంలో అధికారులు, పంచాయతీ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి ఐఎస్‌ఓ సర్టిఫికెట్ పొందితే కలిగే లాభాల గురించి వివరించారు. ఐఎస్‌ఓ ప్రతినిధి శ్రీషాతో ఎంపీడీఓ నగేష్‌కుమారి, ఈఓపీఆర్డీ నరసింహారెడ్డి, వార్డుసభ్యులు ఉన్నారు.

బాలలను పనిలో పెట్టుకునే వారిపై కఠిన చర్యలు



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఆంధ్ర రాష్ట్రాన్ని బాల్య వివాహాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేలా తాము పనిచేస్తున్నామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు (ఏపీ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ మెంబర్) పద్మావతి అన్నారు. ఆమె గురువారం నగరానికి విచ్చేసి డైకస్‌రోడ్డులోని మహిళా ప్రాంగణంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 0–18 సంవత్సరాల వయస్సు కలిగిన బాలల హక్కుల పరిరక్షణ కోసం కమిషన్ పనిచేస్తోందని అన్నారు. అందుకోసం పలు శాఖలలో బాలల కోసం అమలు అవుతున్న పథకాలను సమీక్షించేందుకు నెల్లూరు నగరానికి రావటం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో వినూత్న మార్పులు తీసుకువచ్చిందని బడిఈడు వయస్సు పిల్లలందరూ బడిలోనే ఉండాలనే లక్ష్యంతో పనిచేయాలన్నారు. బాలలను పనిలో పెట్టుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని అన్నారు. అనంతరం జిల్లా వైద్యాధికారి డా.పెంచలయ్య, డీఈఓ గంగాభవాని, కార్మికశాఖ డీసీ వెంకటేశ్వర్లు, ఆర్ఐఓ ప్రసాద్, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన, పీఓ రాణి, ఎస్ఎస్ఏ ఏపీఓ ఉషారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేషలతో బాలల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు.

యూజీ ఆనర్స్ విత్ రీసెర్చ్‌కి నోటిఫికేషన్ విడుదల

వెంకటాచలం: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ)లో యూజీ ఆనర్స్ విత్ రీసెర్చ్ డిగ్రీ నాల్గవ సంవత్సరం కోర్సుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సులో 75శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈ కోర్సులో చేరే విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులని, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 31తేదీలోగా వీఎస్‌యూ ప్రిన్సిపాల్ ఆఫీసులో సంప్రదించాలని తెలిపారు.

నేడు జలదంకిలో జగనన్నకు చెబుదాం



నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం మండలస్థాయిలో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమాన్ని శుక్రవారం జలదంకిలో నిర్వహిస్తున్నామని జిల్లా పరిషత్ సీఈఓ బి చిరంజీవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జలదంకి తహశీల్దారు కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్ కూర్మనాథ్ ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జలదంకి మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీఈఓ చిరంజీవి కోరారు.

విజయఢంకా మోగిద్దాం

నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీకి కంచుకోట అని నిరూపిద్దాం

- చేసిన సంక్షేమ పథకాలను గడప గడపలో ప్రజలకు వివరిద్దాం
- వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడమే మన లక్ష్యం
- పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి ఉద్బోధ
- కోవూరు, నెల్లూరు రూరల్, కందుకూరు, ఆత్మకూరు నియోజకవర్గాల నాయకులతో సమీక్ష



నెల్లూరు పట్టణ సమీపంలోని వీపీఆర్ కన్వెన్షన్‌లో జరిగిన నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి. చిత్రంలో ఎంపీలు వేమిరెడ్డి, ఆదాల, గురుమూర్తి, మేయర్ స్రవంతి, రూరల్ పరిశీలకులు మెట్టుకూరి ధనుంజయరెడ్డి

నెల్లూరు(సెంట్రల్), సాక్షి ప్రతినిధి, నెల్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి కంచుకోటగా ఉన్న నెల్లూరు జిల్లాలో పార్టీ మరోసారి విజయఢంకా మోగించే విధంగా అందరం కలసికట్టుగా పనిచేద్దామని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటరులో కోవూరు, నెల్లూరు రూరల్, కందుకూరు, ఆత్మకూరు నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, నాయకులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిలతో పాటు ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మానుగుంట మహీధర్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పించడంతో పాటు, సమస్యలను పరిష్కరించుకుంటూ కలసికట్టుగా ముందుకు పోదామన్నారు. ఒకరిద్దరు పార్టీని వీడినంత మాత్రాన వచ్చిన నష్టం ఏమీలేదన్నారు. ప్రధానంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ, సమస్యలు పరిష్కరిస్తూ వారి విశ్వాసాన్ని నిలబెట్టుకుందామన్నారు. ముఖ్యంగా 2019కి ముందు, ప్రస్తుతం ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత పేద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలు ఏ విధంగా పెరిగాయో ఒకసారి పరిశీలించాలన్నారు. కొన్ని పత్రికలు అసత్యాలు రాస్తున్నాయని, వాటిని ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. మనందరి లక్ష్యం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవడమేనన్నారు. మనందరికి నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అన్నారు. ప్రధానంగా దొంగ ఓట్లను నిర్మూలిద్దామన్నారు. నెల్లూరు పార్లమెంటుకు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అదే విధంగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, మానుగుంట మహీధర్‌రెడ్డిలకు మీ అందరి ఆశీస్సులు, అండదండలు ఇవ్వాలన్నారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. మన రాష్ట్రంలోని వలంటీర్ల వ్యవస్థను ఇతర ప్రాంతాల్లో అమలు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడంలో వారి పాత్ర ఎంతో కీలకంగా ఉందన్నారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆదర్శంగా తీసుకుని అనేక రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 87 శాతం ఇళ్లకు ఏదో ఒక రూపంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు.

ఒక్కతాటిపై ముందుకు వెళ్లాలి



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మనందరి లక్ష్యం పార్టీని గెలిపించుకోవడం, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరొకసారి ముఖ్యమంత్రిని చేసుకోవడమే అన్నారు. నియోజకవర్గాల్లో చిన్నచిన్న సమస్యలను అందరం కలసికట్టుగా పరిష్కరించుకుని ఒక్కతాటిపై ముందుకు వెళదామన్నారు. తాను నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని మీ అందరి సహకారం ఉండాలన్నారు.

కలసికట్టుగా నడుద్దాం



ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరం కలసికట్టుగా ఉంటూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. పార్టీ గెలుపే ధ్యేయంగా అన్ని నియోజకవర్గాల్లో ముందుకు వెళదామన్నారు.

ఆక్వా రైతులను ఆదుకుంటాం

నాన్ ఆక్వా జోన్లలో అర్హత కలిగిన 14 వేల కనెక్షన్‌లకు ఆక్వా జోన్‌లోకి తీసుకుని వచ్చేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. మొత్తం 63 వేలకు పైగా ఆక్వా కనెక్షన్‌లలో 46 వేలకు పైగా అర్హత కలిగినవిగా గుర్తించి ఆ కనెక్షన్‌లకు యూనిట్‌కు రూ.1.50 ఇవ్వడం జరుగుతుందన్నారు. మిగిలిన 14 వేల కనెక్షన్‌లను ఆక్వా జోన్ పరిధిలోకి తీసుకొచ్చి యూనిట్‌కు రూ.1.50 పైసలకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రైతులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గంలో ఎవరికి టికెట్ ఇచ్చినా వైఎస్సార్‌సీపీ జెండానే నియోజకవర్గంలో ఎగరాలన్నారు. అందరి లక్ష్యం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చూడడమే అన్నారు. చిన్న చిన్న సమస్యలను పరిష్కరించుకుని పార్టీ కోసం పనిచేద్దామన్నారు. నెల్లూరు కార్పొరేషన్ మేయర్ స్రవంతి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. మన ధ్యేయం వైఎస్ జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవడమే అన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిశీలకులు మెట్టుకూరు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ మనం ఎంత కష్టపడ్డా వైఎస్సార్‌సీపీని గెలిపించుకోసమే అని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవడమే లక్ష్యంగా పనిచేద్దామన్నారు. కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు కనకారావు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు అందరం వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామన్నారు.

అందరం కష్టపడి పనిచేద్దాం



నెల్లూరు పార్లమెంటు సభ్యుడు, రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మనం అందరం సమిష్టిగా పని చేసి మంచి ఫలితాలను తీసుకుని వద్దామన్నారు. రానున్న ఎన్నికలు ఎంతో ప్రత్యేకమైనవని, ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామన్నారు.

ప్రజలు దేవుళ్లతో సమానం



కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరిగి మనం వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామన్నారు. కోవూరు నియోజకవర్గ ప్రజలు మా కుటుంబాన్ని ఎంతగానో ఆదరిస్తున్నారన్నారు. నియోజకవర్గ ప్రజలు నాకు దేవుళ్ళతో సమానం అన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా సిద్ధంగా ఉండి తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు.

గడప గడపకు వల్ల మేలు



ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెట్టడం బాగుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకునే వీలు ఉందన్నారు.

ఎల్లవేళలా ప్రజలతోనే



కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయడం జరుగుతుందన్నారు. అందరం కలసికట్టుగా పనిచేస్తూ తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు.

ఆత్మకూరు నియోజకవర్గ పరిశీలకులు గురుమోహన్ మాట్లాడుతూ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. శుక్రవారం నాడు నెల్లూరు సిటీ,ఉదయగిరి, సర్వేపల్లి, కావలి నియోజకవర్గాల సమీక్షలు జరగనున్నాయి.



దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి తదితరులు



నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమీక్షా సమావేశానికి హాజరయిన పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు

పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నాం



జగనన్న కాలనీలో పూర్తయిన గృహ ప్రవేశాలకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితరులు



సభలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి. వేదికపై ఎంపీ వేమిరెడ్డి, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు

- రాష్ట్రంలో సీఎం జగన్ మార్క్ పరిపాలన
- ఎన్నికల వాగ్దానాలన్నీ అమలు
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: కోట్ల రూపాయల విలువ గల స్థలాలను ఇళ్ల పట్టాల రూపంలో ఇచ్చి పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పూర్తయిన 7.43 లక్షల ఇళ్లను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ జిల్లా సామర్లకోటలో ప్రారంభించిన నేపథ్యంలో వెంకటాచలం జగనన్న కాలనీలో గృహ ప్రవేశాలను మంత్రి కాకాణి గురువారం ప్రారంభించారు. తొలుత పూర్తయిన ఇళ్లకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించి, అనంతరం జగనన్న కాలనీలోని లబ్ధిదారుల గృహ ప్రవేశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ భారత దేశ చరిత్రలో ఇళ్లు లేని పేదలకు ఏకకాలంలో 30 లక్షల పైచిలుకు మంజూరు చేసిన సీఎంలు ఎవ్వరూ లేరని, ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని కొనియాడారు. మంజూరైన ఇళ్లకు సంబంధించి 21.76 లక్షల మంది లబ్ధిదారులు ఇళ్ల పనులు ప్రారంభిస్తే, వారిలో 7.43 లక్షల మంది ఇళ్లను పూర్తి చేసుకున్నారన్నారు. జిల్లాలో 13వేలకు పైగా లబ్ధిదారుల ఇళ్ల గృహ ప్రవేశాలు జరిగాయన్నారు. పేదలకు ఇళ్లు మంజూరు చేయడమే కాకుండా ఇల్లు నిర్మించి, ఆ ఇంటిపై సంపూర్ణ హక్కులు కల్పించేలా లబ్ధిదారుల పేరుతోనే రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి వాగ్దానికి కట్టుబడి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు.

అడ్డంకులు సృష్టించడమే చంద్రబాబు పని

రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక చంద్రబాబు, టీడీపీ నాయకులు అడ్డంకులు సృష్టించడమే పనిగా పెట్టుకున్నారని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి, ఇళ్లు కట్టిస్తే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు వస్తుందనే దురుద్దేశంతో కోర్టుకు వెళ్లి ఇళ్ల స్థలాల పంపిణీ అడ్డుకోవాలని కుట్రలు పన్నారని మండిపడ్డారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా లెక్క చేయకుండా పేదలకు మంచి చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని చెప్పారు. 371 కోట్లు దోచుకుతిన్న చంద్రబాబు జైలు పాలైతే కక్షసాధింపుకు పాల్పడుతున్నారని టీడీపీ ఆరోపణలు చేయడం అర్థంలేదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎవ్వరికీ సాధ్యం కాని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగుతోందని చెప్పారు. రాష్ట్రంలో ఒకే దఫాలో 7.43 లక్షల మంది లబ్ధిదారుల గృహ ప్రవేశాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించడం చాలా సంతోషకరమన్నారు. తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్యేలు మానుగుంట మహీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ్ చక్రవర్తి, పి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నిరంతరం ప్రజల సంక్షేమం కోసం పరితపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో అమలు కాని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అతిథులను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సత్కరించారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, ఇన్‌చార్జి కలెక్టర్ కూర్మనాథ్, నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, హౌసింగ్ పీడీ నాగరాజు, డీపీఓ సుస్మిత, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మందల వెంకటశేషయ్య, మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండ రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు కొణిదెన మోహన్‌నాయుడు, గ్రామ సర్పంచ్ మందల రాజేశ్వరి, ఎంపీటీసీ వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

- మత్స్య ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు
- ప్రజల్లో అవగాహన పెంచడమే ఉద్దేశం

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరంలోని వీఆర్సీ క్రీడా మైదానంలో మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్–2 శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోలంగారి పోలయ్య తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా కేంద్ర మత్స్యశాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్, ఏపీ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డ్ చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మత్స్య, పాడి పరిశ్రమల మంత్రి సీదిరి అప్పలరాజు తదితరులు పాల్గొంటారన్నారు. ఈ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్–2, సింహపురి సేంద్రియ మేళా ముఖ్య ఉద్దేశం రాష్ట్రంలో సముద్రం ద్వారా లభించే మత్స్య ఉత్పత్తులు, సంపద ఇతర దేశాలకు తరలిపోకుండా ఇక్కడి ప్రాంతం వారే తినే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించడమేనని చెప్పారు. 13వ తేదీ ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు, 14, 15 తేదీల్లో మత్స్య ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు జరుగుతాయన్నారు. ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ మేళా ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందన్నారు.

వైభవంగా గంధ మహోత్సవం



మహోత్సవం సందర్భంగా గంధాన్ని తీసుకెళ్తున్న తాత్కాలిక పీఠాధిపతి ఫయాజ్ అహ్మద్



గంధ మహోత్సవానికి భారీగా చేరుకున్న భక్తులు

- పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు

అనుమసముద్రంపేట: రెండు గ్రూపుల హైడ్రామా నడుమ అర్ధరాత్రి ఆత్మకూరు ఆర్డీఓ సంప్రదింపులు జరపడంతో ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో 250వ గంధ మహోత్సవం ప్రశాంతంగా జరిగింది. గంధ మహోత్సవంలో గంధం ఎవరు ఎత్తాలనే అంశంపై దర్గా వంశస్థులు ఫయాజ్ అహ్మద్, మాజీ పీఠాధిపతి హఫీజ్ పాషాల నడుమ వివాదం ఓ కొలిక్కి రాకపోవడంతో ఆర్డీఓ ఎస్ కరుణకుమారి రంగప్రవేశం చేశారు. ఆత్మకూరు డీఎస్పీ ఎస్ కోటారెడ్డితో కలసి ఇరువర్గాలతో మాట్లాడి చివరకు వంశస్థులు ఫయాజ్ అహ్మద్ గంధం ఎత్తేలా నిర్ణయించారు. దీంతో మహల్ నుండి తాత్కాలిక పీఠాధిపతి ఫయాజ్ అహ్మద్ మేళతాళాలతో గంధం ఎత్తుకుని దర్గాకు చేరుకున్నారు. విద్యుత్ కాంతుల వెలుగులో ప్రధాన దర్గాలోని హజరత్‌నాయబ్ రసూల్, దొరసానమ్మల సమాధుల వద్దకు చేరుకుని అక్కడి సమాధులకు గంధం లేపనం చేశారు. అనంతరం భక్తులకు గంధాన్ని పంచిపెట్టారు. గంధ మహోత్సవానికి రాష్ట్ర నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలించారు. గంధమహోత్సవం సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు.

క్లుప్తంగా

అభ్యర్థుల తాత్కాలిక జాబితా విడుదల

నెల్లూరు (టౌన్): జిల్లాలోని భవిత కేంద్రాల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన సహిత విద్య రిసోర్స్ పర్సన్ల పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితాను apie.apcfss.inలో ఉంచామని సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే తగిన ఆధారాలతో నెల్లూరులోని సమగ్ర శిక్ష కార్యాలయాన్ని శుక్రవారం సాయంత్రం ఐదు గంటల్లోపు సంప్రదించాలని సూచించారు.

ఐఐటీటీఎం స్కిల్ కళాశాలలో పరిశీలన



పరిశీలిస్తున్న శ్రీధర్‌రెడ్డి

వెంకటచలం: స్కిల్ కళాశాలలను యువత సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు (స్కిల్ ట్రెయినింగ్ అండ్ జాబ్ ఫెయిర్) గాది శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గొలగమూడి సమీపంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రెయినింగ్ మేనేజ్‌మెంట్ (ఐఐటీటీఎం)లో గల స్కిల్ కళాశాలను గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన కేంద్రాల్లో సుమారు 1.25 లక్షల మంది శిక్షణ పొందితే 90 వేల మంది ఆయా రంగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, వంటశాలను పరిశీలించి పలు విషయాలపై విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఐఐటీటీఎం కేంద్ర నోడల్ అధికారి డాక్టర్ మౌనిక ప్రకాష్, కేంద్ర ఇన్‌చార్జి డాక్టర్ సర్వనన్, స్కిల్ కాలేజ్ సమన్వయకర్త లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

• రూ.82,800 నగదు స్వాధీనం

మనుబోలు: మండలంలోని వడ్లపూడి సమీపంలో గల అటవీ ప్రాంతంలో జూదరులపై మనుబోలు పోలీసులు గురువారం సాయంత్రం దాడులు జరిపారు. డైమండ్ డబ్బా ఆడుతున్న నలుగురిపై దాడి చేసి రూ.82,800 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఎస్సై అజయ్‌కుమార్, కానిస్టేబుల్ మాధవ్, కమలాకర్ పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో బాలుడికి గాయాలు



మనుబోలు: మనుబోలులోని కోదండరామపురంలో ఓ పిచ్చికుక్క గురువారం స్వైరవిహారం చేసింది. వివరాలు.. మండలంలోని పిడూరుకు చెందిన సాయికుమార్, హర్షిత దంపతులు స్థానికంగా కూరగాయల దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. దుకాణం ముందు వీరి కుమారుడు అభి రిత్విక్ ఆడుకుంటుండగా, ఓ పిచ్చి కుక్క దాడి చేసింది. గోళ్లతో రక్కడంతో బాలుడి మెడపై గాయమై రక్తస్రావమైంది. కుక్కను స్థానికులు తరమి బాలుడ్ని రక్షించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా, వైద్యుడు సుబ్బరాజు ప్రాథమిక చికిత్స చేశారు.

అవినీతి జరిగితే అరెస్ట్ చేయరా..?



మాట్లాడుతున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అవినీతి జరిగిందనే అంశం రుజువు కావడంతో చంద్రబాబును సీఐడీ అరెస్ట్ చేసిందని.. ఇది తప్పెలా అవుతుందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రశ్నించారు. పట్టణంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల ఆరోగ్యం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష లాంటి చక్కటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న సీఎంను ప్రోత్సహించాల్సిన ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేయడం అవివేకమని చెప్పారు. రాష్ట్ర ప్రజల ఆశీర్వాదంతో 175 స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో నాలుగేళ్లుగా కేసు నడుస్తోందని, అవినీతిపరులను అరెస్ట్ చేస్తే రాజకీయ కక్ష సాధింపు అనడం సబబుకాదని హితవు పలికారు. అవినీతి ఆధారాలతో రుజువు కావడంతోనే అరెస్ట్ చేశారని, ఇందులో సీఎంకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

హైవేపై దోపిడీలకు పాల్పడే ముఠా అరెస్ట్

• రూ.3.5 లక్షల సొత్తు స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న వెంకటరమణ

కావలి: మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఇటీవల దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతున్న ఆరుగురు సభ్యుల ముఠాను కావలి పోలీసులు గురువారం చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. చోరీలకు వినియోగించే కారు, మూడు పల్సర్ బైక్‌లను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. కావలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను డీఎస్పీ వెంకటరమణ వెల్లడించారు. బోగోలు మండలం కప్పరాళ్లతిప్పకు చెందిన బోగిరి ఆకాష్, బాణాల చిన్నా, బాణాల యాకోబ్, ఆకుల కుమార్, కోవూరుపల్లి పంచాయతీ అంబేడ్కర్‌నగర్‌కు చెందిన విడవలూరు నందు, విశ్వనాథరావుపేటకు చెందిన జలచిత్ర ధనుష్ ముఠాగా ఏర్పడ్డారు. తమిళనాడుకు చెందిన డ్రైవర్ గౌరవరంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో లారీని నిలిపి నిద్రిస్తుండగా కారులో వచ్చిన ముఠా సభ్యులు క్యాబిన్‌లోకి ఎక్కి దొంగతనం చేసేందుకు ఈ నెల ఏడున యత్నించారు. లారీ డ్రైవర్ మేల్కొని కేకలేయడంతో కత్తి చూపించి బెదిరించారు. అనంతరం క్యాబిన్‌లోని రూ.20 వేల నగదు, సెల్‌ఫోన్‌ను చోరీ చేసి కారులో పరారయ్యారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న కావలి రూరల్ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు కావలి డీఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో రూరల్ సీఐ రాజేష్, ఎస్సై సుమన్ పక్కా సమాచారంతో తనిఖీలు నిర్వహిస్తుండగా, గౌరవరం దాబాల వద్ద ముఠా పట్టుబడింది. నిందితుల నుంచి రూ.3.5 లక్షల విలువైన కారు, మూడు పల్సర్ బైక్‌లు, రూ.12 వేల నగదు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులను డీఎస్పీ అభినందించారు.

ఉన్నత పాఠశాలలో తనిఖీ

సోమశిల: అనంతసాగరంలోని ఉన్నత పాఠశాలను కావలి ఉప విద్యాశాఖాధికారి రఘురామయ్య గురువారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధన, పిల్లల సామర్థ్యాలు, రికార్డులను పరిశీలించారు. ఎంఈఓలు బాలకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న బ్రిజిత

కొడవలూరు: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా స్పెషలిస్ట్ డాక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏడీఎంహెచ్‌ఓ బ్రిజిత సూచించారు. నార్తురాజుపాళెంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఎముకలు, కీళ్లు, ఊపిరితిత్తులు, నేత్ర తదితర ఆరోగ్య సమస్యలకు శిబిరంలో వైద్య సేవలందించడంతో పాటు ఎలాంటి సమస్యలకైనా ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సను అందించేలా చర్యలు చేపడుతున్నారని వివరించారు. ప్రజల వద్దకే స్పెషలిస్ట్ డాక్టర్లు వచ్చి వైద్యసేవలందించడం గతంలో ఎప్పుడూ లేదన్నారు. దాదాపు 508 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. వైద్య సేవలను నిపుణులు మనీష్, రాజేష్ రెడ్డి, శశికళ, పీహెచ్‌సీ వైద్యులు రామకృష్ణ, బాల చంద్రబాబు, కావ్య అందించారు. ఎమ్మెల్ హెచ్‌పీలు సరోజ, స్నేహ, సీహెచ్‌ఓ సోమశేఖర్, హెచ్ఎస్ రామ్మోహన్, హెచ్‌ఏ షఫీఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనకు కేతంరెడ్డి రాజీనామా



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జనసేనకు తాను రాజీనామా చేస్తున్నానని ఆ పార్టీ నేత కేతంరెడ్డి వినోద్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనసేన కోసం నగరంలో ఎంతో కృషి చేశానని, నెల్లూరు నగర నియోజకవర్గానికి అభ్యర్థిగా నారాయణను టీడీపీ మూడు నెలల క్రితం ప్రకటించిందని పేర్కొన్నారు. అప్పటికి జనసేనతో టీడీపీకి పొత్తు లేదని, అయినా తనను వచ్చే ఎన్నికల్లో సీటు ఆశించొద్దని.. నారాయణతో మనం కలిసి పని చేయాలని పార్టీ పెద్దలు పలువురు తనకు తెలిపారన్నారు. 2016లో సేవ్ నెల్లూరు అంటూ పోరాటం చేసిందే నారాయణ అక్రమాలపైనని, 2019 ఎన్నికల్లో ప్రత్యర్థిగా ఆయన అక్రమాలపై గళం వినిపించానని తెలిపారు. పార్టీలో తనకంటూ గౌరవం లేకుండా.. తాను భరోసా కల్పించిన ప్రజలకు నమ్మకం పోగొట్టేలా పార్టీలోని పలువురు వ్యవహరించారని.. ఇది సహించలేకే పార్టీకి రాజీనామా చేస్తున్నానని పేర్కొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం



వృద్ధురాలికి కళ్లద్దాలను అందజేస్తున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పేదలందరికీ మెరుగైన వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. దగదర్తి మండలం శ్రీరామపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి సచివాలయ పరిధిలో సురక్ష క్యాంపులను నిర్వహిస్తున్నామని, పేదల గడప వద్దకే వైద్యసేవలను అందిస్తున్నారని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో అరకొర వసతులతో నిరుపేదలకు సరైన వైద్యం అందేది కాదని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రభుత్వాస్పత్రుల రూపురేఖలే మారిపోయాయని తెలిపారు. ఈ సందర్భంగా పలువురికి కళ్లద్దాలను అందజేశారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్షలో అందించే వైద్య సదుపాయాలు, మెడికల్ క్యాంపును పరిశీలించారు. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత వివేక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కసుమూరులో ఘనంగా గంధ మహోత్సవం



చందన్ మహల్ నుంచి గంధం ఊరేగింపు



ప్రార్థనలు చేస్తున్న కడప పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేన్

వెంకటాచలం: కసుమూరులోని మస్తాన్‌వలీ దర్గా గంధ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. దర్గాకు కిలోమీటర్ దూరంలోని చందన్ మహల్ నుంచి గంధాన్ని గుర్రంపై బుధవారం అర్ధరాత్రి ఊరేగించారు. కసుమూరు వీధుల్లో మేళతాళాల మధ్య ఊరేగింపు వేడుకగా సాగింది. గంధాన్ని దర్గాకు తీసుకొచ్చిన అనంతరం మస్తాన్‌వలీ సమాధిపై చద్దర్ కప్పి ప్రత్యేక ప్రార్థనలను కడప పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేన్ జరిపారు. అనంతరం గంధం బిందెను దర్గా ముజావర్లకు అందజేశారు. తదుపరి గంధాన్ని భక్తులకు పంపిణీ చేశారు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి భక్తులు భారీగా హాజరయ్యారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అదనపు క్యూలను ఏర్పాటు చేయించి బందోబస్తును నిర్వహించారు. కాగా గంధ మహోత్సవాల్లో భాగంగా తహలీల్ ఫాతేహాను శుక్రవారం నిర్వహించనున్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.50
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.5

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: రూ.125
లేయర్ (లైవ్)	: రూ.118
బ్రాయిలర్ చికెన్	: రూ.220
స్కిన్‌లెస్ చికెన్	: రూ.242
లేయర్ చికెన్	: రూ.200

లైవ్ స్టాక్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న నిరంజన్‌బాబురెడ్డి

నెల్లూరు(బృందావనం): జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి పేర్కొన్నారు. జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా పాడి రైతులకు అందించే సబ్సిడీ రుణాలపై జిల్లా స్థాయి అవగాహన సదస్సును నగరంలోని పురమందిరంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పాడి రైతుల ఆర్థిక పురోగతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. ఈ పథకం ద్వారా వివిధ పాడి యూనిట్ల స్థాపనకు రూ.పది లక్షల నుంచి రూ.కోటి వరకు గరిష్ఠంగా రూ.50 లక్షల వరకు రాయితీపై రుణాలను అందించనున్నారని వివరించారు. గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాతీయ లైవ్ స్టాక్ మిషన్ రుణాలను పొందడం.. గొర్రెలు, మేకల పెంపకం.. వ్యాధుల నివారణ తదితరాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా డాక్టర్లు మాలకొండయ్య, బాలకోటేశ్వరరావు అవగాహన కల్పించారు. డీఆర్వో వెంకటనారాయణమ్మ, పశుసంవర్ధక శాఖ జేడీ కోటేశ్వరరావు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, ఎల్డీఎం ప్రదీప్‌కుమార్, ఐఎస్పీ ఏడీ మాధవీలత, డిప్యూటీ డైరెక్టర్లు సోమయ్య, రమేష్, చంద్రశేఖర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 26న మహా కార్తీక దీపోత్సవం



సమావేశానికి హాజరైన నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని మహా కార్తీక దీపోత్సవాన్ని నగరంలోని గణేశ్ ఘాట్‌లో నవంబర్ 26న నిర్వహించనున్నామని సింహపురి కార్తీక దీపోత్సవ సమితి నేతలు తెలిపారు. కార్తీక దీపోత్సవ నిర్వహణకు సంబంధించిన సమావేశాన్ని రామ్మూర్తినగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో సింహపురి కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. వివిధ ఆధ్యాత్మిక కార్య క్రమాల నడుమ ఉదయం ఆరు నుంచి రాత్రి 11 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించాలని తీర్మానించారు. సమితి అధ్యక్షురాలు డాక్టర్ వెన్నెల అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రధాన కార్యదర్శులు రాజేశ్వరి, బయ్యా మల్లిక, కోడూరు జయప్రద, నాగలక్ష్మి, ముక్కాల వ్యాసప్రసాద్, కోడూరు జయరామ్, సుభాషిణి, నీలమణి, రమేష్, వాసుదేవరావు, విజయకుమార్, నాగశ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు సంఘమిత్రకు పురస్కారం



కొడవలూరు: మండల సంఘమిత్ర (ఎస్‌హెచ్‌జీ సమాఖ్య)కు జాతీయ స్థాయిలో ఉత్తమ పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జాతీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో పురస్కారాన్ని ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ చేతుల మీదుగా ఏపీఎం రుక్మిణి అందుకున్నారు. దేశంలోని 19 రాష్ట్రాలు హాజరైన ఈ సదస్సులో కొడవలూరు సంఘమిత్రకు ఉత్తమ పురస్కారం దక్కడం గర్వకారణమని ఆమె పేర్కొన్నారు. సీసీ శ్రీదేవి పాల్గొన్నారు.

జేసీని కలిసిన కన్సల్టెంట్



నెల్లూరు(దర్గామిట్ట): జేసీ కూర్మనాథ్‌ను నగరంలోని ఆయన చాంబర్‌లో ఇన్వెస్ట్ ఇండియా ఏజెన్సీ సీనియర్ కన్సల్టెంట్ ఆరాధన మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్ అవార్డుకు జిల్లా నుంచి ఎంపికైన ఉదయగిరి చెక్కనగిషీ కళాకారుల పనితీరును పరిశీలించిన అంశాన్ని జేసీకి తెలిపారు. మేకిన్ ఇండియా, వోకల్ ఫర్ లోకల్, గ్లోబల్ అవుట్ రీచ్‌తో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలను ప్రోత్సహించేందుకు గానూ ప్రతి జిల్లాలో పారిశ్రామికీకరణ, తయారీని పెంచడం ప్రధాన లక్ష్యమని వివరించారు. డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, హ్యాండ్లూమ్ ఏడీ ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.